తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

### గుడూరుని నెల్లూరులో...
# కలపాలని నిరసన

గూడూరు, నవంబర్ 28 ప్రభాతవార్త: యువగళం పాత యాత్రలో యువ నాయకులు,ప్రస్తుత మంత్రి నారా లోకేష్ తిరుపతి జిల్లాలో ఉన్న గుడూరుని నెల్లూరులో కలపడం జరుగుతుందని ఎన్నికల హామీల్లో ఇవ్వడం జరిగిందని, వైసిపి ప్రభుత్వం నెల్లూరు జిల్లాలో ఉన్న గూడూరుని తిరుపతి జిల్లాలో కలిపి ప్రజలను అధికారులను ఇబ్బందులకు గురిచేశారని, తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే ఖచ్చితంగా గూడూరు నెల్లూరులో కలుపుతామని హామీ ఇచ్చిన లోకేష్, సిఎం నారా చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చి ఇప్పుడు గూడూరు తిరుపతి జిల్లాలోని ఉంటుందని, గూడూరు రెవిన్యూ డివిజన్‌కి కలువాయి, రాపూర్ సైదాపురం, మండలాలు విలీనం చేయడం ఎంతవరకు సబబు అన్నారు. వీలైనంత త్వరగా గూడూరును నెల్లూరులో కలపాలని, లేకుంటే ప్రజా సంఘాలు విద్యార్థి సంఘాలు వ్యాపారస్తులు, రైతులు స్వచ్ఛందంగా పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామన్నారు. తిరుపతి జిల్లాలో ఉన్న గూడూరుని నెల్లూరులో కలపకపోతే త్వరలో జరగబోయే మున్సిపాలిటీ, స్థానిక సంస్థ ఎన్నికల్లో భారీ మూల్యం చెల్లించకో కతప్పదు హెచ్చరించారు. అన్ని శాఖల అధికారులు రైతులుఅన్ని విధాలుగా తిరుపతి జిల్లాలో ఉండడం వల్ల తీవ్రంగా నష్టపోవాల్సిన పరిస్థితి నెలకొందని తెలిపారు. కొంతమంది నాయకుల వ్యాపారాలు, లావాదేవీల, స్వార్థం కోసం ఇలాంటి అఘాయిత్యాలకు పాల్పడుతున్నారని, ఇది సరైన పద్ధతి కాదని, ప్రజలే రేపు జరగబోయే ఎన్నికల్లో సరైన గుణపాఠం చెప్తారన్నారు. అనంతరం గూడూరు సపోర్ట్ ఆఫీస్‌లో ఉన్న ఏవో శిరీషకి వినతిపత్రం సమర్పించారు. గూడూరు ను జిల్లా చేయాలని, లేకుంటే నెల్లూరులో కలపాలని డిమాండ్ చేశారు. తాజాగా సైదాపురం, రాపూరు, కలువాయి మండలాలలను నెల్లూరు నుండి తొలగించి తిరుపతి జిల్లాలో కలుపుతున్నట్లు ప్రభుత్వం ప్రకటించడంతో ఆయా ప్రాంతాల్లో ప్రజల నుండి తీవ్ర నిరసన వ్యక్తమవుతోందన్నారు. ఈ క్రమంలో భాగంగా గూడూరు పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ఎ.ఎస్.ఎ స్టూడెంట్స్ అసోసియేషన్‌తో పాటు పలు ప్రజా సంఘాల నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. గూడూరును జిల్లా చేయాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘం నాయకుడు షఫీ హరన్ తదితరులు మాట్లాడుతూ గూడూరును నెల్లూరు జిల్లాలో విలీనం చేయాలి లేదా జిల్లాగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. గూడూరు నుండి తిరుపతికి వెళ్ళాలంటే వంద కిలోమీటర్లకు పైగా ప్రయాణించాల్సి వస్తోందన్నారు. పేదలు వ్యయ ప్రయాసలు భరించలేరని తెలిపారు. గతంలో సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ గూడూరు పర్యటనలకు వచ్చినప్పుడు గూడూరును నెల్లూరు జిల్లాలో కలుపుతారని హామీ ఇచ్చారు. హామీని వెంటనే నెరవేర్చాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు భాస్కర్ గౌడ్, ఎల్.వి. సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

### ఎస్సీ ఎస్టీ వర్గాల...
# ఆర్థికాభివృద్ధికి ప్రణాళికలు

**- ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజనకు జిల్లాలో 107 గ్రామాలు ఎంపిక - జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సమావేశంలో ఎంపీ**



ఎంపీ దగ్గుమళ్ళ అధ్యక్షతన జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సమావేశం

చిత్తూరు, నవంబర్ 28 ప్రభాతవార్త: జిల్లాలో ఎస్సీ, ఎస్టీ వర్గాల ఆర్థికాభివృద్ధికి పక్కాగా ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలని ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు అధ్యక్షతన శుక్రవారం జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ(దిశ) సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కలెక్టర్ సుమిత్‌కుమార్, పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు మాట్లాడుతూ అర్హులైన నిరుపేదలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను చేరువ చేసి, వారి జీవితాల్లో వెలుగులు నింపడానికి జిల్లా యంత్రాంగం చిత్తశుద్ధితో పని చేయాలన్నారు. ఉపాధి హామీ పథకం కింద జిల్లాకు రావాల్సిన నిధులు మంజూరుకు కృషి చేస్తానన్నారు. ఎస్సీ, ఎస్టీ వర్గాల యువతకు వివిధ శిక్షణా కార్యక్రమాలు డిఆర్‌డిఎ ఆధ్వర్యంలో నిర్వహించాలని ఆదేశించారు. జిల్లాలో ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా సరుకులను నాణ్యతగా పంపిణీ చేయాలని ఆదేశించారు. ఇళ్ళ నిర్మాణాలకు సంబంధించి తహసిల్దార్లు పొజిషన్ సర్టిఫికేట్ల మంజూరులో జాప్యం చేయకుండా త్వరితంగా మంజూరు చేయాలన్నారు. జిల్లాలో ఎక్కడా ఎస్సీ, ఎస్టీలకు స్మశానాలు లేదనే ఫిర్యాదు చేయరాదని, సంక్షేమ పథకాల అమలుపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద మంజూరైన ఇళ్ళకు సంబంధించి పూర్తయిన పనులకు బిల్లుల చెల్లింపు సత్వరం జరుగాలని, కేంద్ర ప్రభుత్వం కేటాయించిన నిధులను వెంటనే ఖర్చు చేసి నిర్మాణాలు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో 53 వేల ఇళ్ళ నిర్మాణాలు పూర్తి అయ్యాయని, ప్రతి నెల సరాసరి 300 ఇళ్ళు పూర్తి అయ్యేలా చేస్తున్నామన్నారు. జిల్లాలో మరిన్ని గ్యాస్ కనెక్షన్ల పెంపుకు సచివాలయాల పరిధిలో విఆర్‌ఓల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని తహసిల్దార్లను ఆదేశించడం జరిగిందన్నారు. జిల్లాలో 107 ఎస్సీ గ్రామాల్లో ఆదర్శ యోజన గ్రామాలను ఎంపిక చేయడం జరిగిందని, మొదటి విడతలో 66 గ్రామాలకు 20 లక్షల రూపాయల జడ్పీ నిధులను విడుదల చేయడం జరిగిందన్నారు. జడ్పీ సిఇఓ రవికుమార్‌నాయుడు, పంచాయతీరాజ్ ఎస్ఇ చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ విజయకుమార్, డ్వామా పిడి రవికుమార్, జిల్లా విద్యాశాఖ అధికారి వరలక్ష్మి, సమగ్రశిక్ష ఎపిసి వెంకటరమణ, డిఆర్‌డిఎ పిడి శ్రీదేవి, జిల్లా వ్యవసాయశాఖ జెడి మురళీకృష్ణ, జిల్లా ఉద్యానశాఖ అధికారి మధుసూధన్‌రెడ్డి, సిపిఓ శ్రీనివాసులు, ఎల్డీఎం హరీష్, జిల్లా స్త్రీ శిశు సంక్షేమశాఖ అధికారి వెంకటేశ్వరీ, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్‌రావు, డిఎంహెచ్ఓ డాక్టర్ సుధారాణి, డిఎస్ఓ శంకరన్, ఇతర జిల్లా అధికారులు హాజరయ్యారు.

## కళ్ళముందు కష్టం...
# కనికరించలేని వైనం

**-స్కానింగ్, ఎక్స్‌రేలకు ఛలో తిరుపతి రుయా**
**-ఇదీ చంద్రగిరి సదరం సెంటర్ దుస్థితి**

చంద్రగిరి, నవంబర్ 27 ప్రభాతవార్త: మానసిక వైకల్యంతో దిక్కులు చూస్తున్న తనయుడిని మోసుకువచ్చిన తల్లిదండ్రుల కష్టం కళ్ళముందు కనబడుతున్నప్పటికీ వైద్యుడు కనికరించలేని వైనం చంద్రగిరిలో ఏరియా ఆసుపత్రి (కమ్యూనిటీ హెల్త్ సెంటర్) లో ఆవిష్కృతమయ్యింది. (లోకోమోటర్ .. పోలియో, పార్కింగ్సన్స్, మేజర్ యాక్సిడెంట్స్, యాంపుటేషన్స్, సెరిబ్రల్ పాలసీ, కంజనేటర్ డిఫార్మోటీకి మాత్రమే వర్తిస్తుందని డాక్టర్ పావన్ చెబుతున్నారు.) రామచంద్రాపురం మండలం, నెత్తకుప్ప ఒకు చెందిన ఓ కుటుంబంలో మానసిక వైకల్యంకలిగిన అబ్బాయిని వైద్య చికిత్సల నిమిత్తం సౌకర్యంగా వుంటుందని తిరుపతిలో వుంటున్నారు. ఈ క్రమంలో వైద్యులు పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకోమని తల్లిదండ్రులకు సూచించారు. ఆ మేరకు సదరం శ్లాట్ బుక్ చేసుకునేందుకు సచివాలయానికి వెళ్ళగా తిరుపతి రుయాలో ఆయా విభాగాలకు తిరగడం కష్టంగా వుంటుందని చంద్రగిరి సిహెచ్‌సికి శ్లాట్ తీసుకున్నారు. అదేవిధంగా చంద్రగిరి అక్కగార్ల కాలనీకి చెందిన ఒక వ్యక్తి బ్రైయిన్‌కు టిబి సోకడంతో పక్షవాతానికి గురయ్యాడు. దీంతో అతని భార్య సిమ్స్‌తో పాటు బెంగుళూరులో వైద్యం చేయించారు. పక్షవాతానికి గురైన కాలు, చెయ్యి పాక్షికంగా మాత్రం నయం కాగలదని పెన్షన్‌కు దరఖాస్తు చేసుకోమని వైద్యులు సూచించారు. మానసిక వైకల్యం కలిగిన తమ కుమారుడిని అతికష్టం మీద చంద్రగిరి ఆసుపత్రికి తీసుకువచ్చారు. అయితే ఇక్కడ జనరల్ మెడిసన్, న్యూరాలజీ, మానసిక వైద్యులు లేకపోవడంతో ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ పావన్ తనపరిధిలో లేని అంశంపై అభిప్రాయాన్ని (వ్రాతపూర్వక) కోరుతూ తిరుపతి రుయా ఆసుపత్రి వైద్యుల చెంతకు పంపుతున్నారు. కనీస మానవత్వం కలిగిన వైద్యులు ఎవరైనా సరే ఎటువంటి పరీక్షలు అవసరం లేకుండానే సదరు బాధితుడికి పూర్తి స్థాయి అర్హతతో సర్టిఫికెట్‌ను మంజూరు చేస్తారు. అయితే తనపరిధిలో లేకపోవడంతో డాక్టర్ పావన్ ఎక్స్ రే కొరకు నారావారిపల్లి సిహెచ్‌సికి లేదా తిరుపతి రుయాకు, స్కానింగ్‌లు కోసం తిరుపతి రుయాకు పంపించేశారు. చంద్రగిరి రావడానికే ఇబ్బంది పడిన ఆ అబ్బాయి తల్లిదండ్రులు రెండు రోజులు శ్రమించి రిపోర్టులు తీసుకుని చంద్రగిరికి వస్తే సర్టిఫికెట్ మంజూరు చేశారు. అంటే అర్హత కలిగిన నిర్భాగ్యుడు ఒక సర్టిఫికెట్ పొందడానికి గల కష్టాలు ఏమిటనేది అధికారులు గమనించాలి. ఇదిలా వుండగా ఎంతో శ్రమించి రిపోర్టులు తీసుకువచ్చిన పక్షవాతానికి గురైన వ్యక్తికి కేవలం 25 శాతంతో సర్టిఫికెట్ మంజూరు కావడంతో అప్పటి వరకు పడిన కష్టం బాధిత కుటుంభాన్ని తీవ్ర నిరాశకు గురిచేసింది. దీంతో దిక్కుతోచని బాధితులు మరోసారి అప్పీలుకు వెళ్ళదలుచుకున్నారు. ఇలాంటి ఘటనలు కోకొల్లలుగా వుండటంతో సదరం బాధితులతో పాటు ఇటువంటి స్థితిని దగ్గరగా గమనిస్తున్న ప్రతి ఒక్కరూ చంద్రగిరిలో సదరం సర్టిఫికెట్స్ మంజూరు చేయడానికి మాత్రమే తగిన వైద్య బృందాలను నెలలో 4 రోజులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ముఖ్యమంత్రి సొంత ఇలాఖాలో అనుభవజ్ఞులైన సీనియర్ వైద్యులు లేకపోవడం రోగుల పాలిట శాపంగానూ, ప్రత్యేక ప్రతిభావంతులకు జీర్ణించుకోలేని కష్టంగానూ పరిణమిస్తున్నది. ఇక్కడ స్కానింగ్ మిషన్ లేకపోవడం, ఎక్స్ రే వున్నప్పటికీ సంతృప్తికరంగా పని చేయకపోవడం వంటి కారణాలు బాధితులకు భౌతికంగానూ, మానసికంగానూ కష్టాన్ని పెంచుతున్నది. ఈ విషయంపై ఎంఎల్‌ఏ పులివర్తి నాని, జిల్లా కలెక్టర్ స్పందించి తగిన చర్యలు చేపట్టాలని లబ్దిదారులు కోరుతున్నారు.



### ఫ్లెమింగో ఫెస్టివల్...
# నిర్వహణకు సన్నాహాలు

**- త్వరలోనే తేదీలు ఖరారు: కలెక్టర్**




అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్

సూళ్లూరుపేట, నవంబర్ 28 ప్రభాతవార్త : పులికాట్‌కు జలకళ సంతరించుకుంది. విదేశీ పక్షుల కిలకిలరావాలతో సందడిగా మారింది. ఈ నేపథ్యంలో ప్రతి ఏటా నిర్వహించే ఫ్లెమింగో ఫెస్టివల్‌ను అత్యంత ఘనంగా నిర్వహించేందుకు సన్నాహాలు ప్రారంభమయ్యాయి. ఇందుకు సంబంధించి తిరుపతిలో జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ అధ్యక్షతన వివిధ శాఖల అధికారులు సమావేశమై ఫ్లెమింగో ఫెస్టివల్ నిర్వహించేందుకు ప్రక్రియ ప్రారంభించేందుకు సమాయత్తం అవుతున్నారు. 2001వ సంవత్సరంలో ప్రారంభమైన ఫ్లెమింగో ఫెస్టివల్ సూళ్లూరుపేట కేంద్రంగా పులికాట్, నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రాల విశిష్టతతో పాటు పులికాట్ సరస్సు జీవన వైవిధ్యాన్ని చాటుతూ వాటి ప్రాముఖ్యతను ప్రపంచానికి తెలియజేసేందుకు ఫ్లెమింగో ఫెస్టివల్ నిర్వహిస్తూ వస్తున్నారు. 2001లో అప్పటి నెల్లూరు జిల్లా కలెక్టర్ కె.ప్రవీణ్‌కుమార్, అప్పటి ఎమ్మెల్యే పరసా రత్నంలు ఫ్లెమింగో ఫెస్టివల్ నిర్వహణకు నాందిపలికారు. అప్పటి నుంచి ఫ్లెమింగో ఫెస్టివల్ ప్రతి ఏటా కొనసాగుతూ వస్తోంది. అప్పుడప్పుడు ఎన్నికల కోడ్, కరోనా సమయాల్లో మాత్రం ఫ్లెమింగో ఫెస్టివల్ చేపట్టలేదు. గత వైసీపీ ప్రభుత్వం హయాంలో ఒక్క పర్యాయం మాత్రం ఫ్లెమింగో ఫెస్టివల్ నిర్వహించారు. అనంతరం నూతనంగా వచ్చిన కూటమి ప్రభుత్వం ఫ్లెమింగో ఫెస్టివల్ 2025ను గత ఏడాది అత్యంత ఘనంగా నిర్వహించారు. దీంతో ఫ్లెమింగో ఫెస్టివల్‌ను ప్రస్తుతం 2026లో నిర్వహించేందుకు తిరుపతి జిల్లా అధికార యంత్రాంగం సన్నాహాలు ప్రారంభించింది. జిల్లా కలెక్టర్, జిల్లా పర్యాటక మండలి ఛైర్మన్ ఎస్.వెంకటేశ్వర్, అటవీశాఖ క్యూరేటర్ సెల్వం, పర్యాటకశాఖ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ రమణప్రసాద్, సూళ్లూరుపేట ఆర్డీఓ కిరణ్మయి, జిల్లా అటవీశాఖ అధికారి సాయిబాబా, డిఎఫ్ఓ హారిక, జనార్ధన్‌రెడ్డి తదితరులు ఫ్లెమింగో ఫెస్టివల్ నిర్వహణపై తిరుపతిలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ఫెస్టివల్‌కు సంబంధించి మైక్రోప్లాన్, టీజర్, పర్యాటక సదుపాయాలు తదితర అంశాలపై ప్రణాళికలు రూపొందించుకుని సమన్వయంతో పనిచేయాలని అధికారులకు సూచించారు. అన్నీ సక్రమంగా జరిగితే జనవరి 2026లో ఫ్లెమింగో ఫెస్టివల్ నిర్వహించే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఇదిలావుంటే గత ఫ్లెమింగో ఫెస్టివల్ 2025కు సంబంధించి చేపట్టిన పనులకు కొంతవరకు బిల్లులు మంజూరు కాలేదని అంటున్నారు. ఈ నేపథ్యంలో ఫ్లెమింగో ఫెస్టివల్ నిర్వహణకు సంబంధించి అధికారులకు గతంలో పనులు చేసిన కాంట్రాక్టర్ల నుంచి ఒత్తిళ్లు ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. వీటన్నింటినీ అధికమించి జిల్లా అధికార యంత్రాంగం, స్థానిక ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ తోడ్పాటుతో ఫెస్టివల్‌ను విజయవంతం చేయాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

### ఏర్పాట్లు తక్షణం ప్రారంభించాలి : జిల్లా కలెక్టర్

తిరుపతి కలెక్టరేట్ , నవంబర్ 28 ప్రభాతవార్త :తిరుపతి కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ మరియు ఛైర్మన్, జిల్లా పర్యాటక మండలి డిటిసి వారి అధ్యక్షతన ఫ్లెమింగో ఫెస్టివల్-2026 నిర్వహణపై ఫారెస్ట్ మరియు జూ క్యూరేటర్ సెల్వం, పర్యాటక శాఖ రీజనల్ డైరెక్టర్ డా.రమణ ప్రసాద్, సూళ్లూరుపేట ఆర్డిఓ కిరణ్మయి, జిల్లా అటవీ శాఖ అధికారి సాయిబాబా, సులూరుపేట డివిజన్ అటవీ శాఖ అధికారి హారిక, సంబంధిత అధికారులతో ఫ్లెమింగ్ ఫెస్టివల్ నిర్వహణపై జిల్లా పర్యాటక మండలి సమీక్షా సమావేశం జరిగింది. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. పులికాట్ సరస్సు పరిసర ప్రాంతాల్లో ప్రతి సంవత్సరం జరుగుతున్న ఫ్లెమింగ్ ఫెస్టివల్ నేపథ్యంలో 2026 జనవరిలో నిర్వహించబోయే ఫ్లెమింగ్ ఫెస్టివల్‌ను మరింత శాస్త్రబద్ధంగా, ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఫ్లెమింగో ఫెస్టివల్‌కు సంబంధించిన మైక్రో ప్లాన్ సిద్ధం చేయడం, తేదీలు ఖరారు చేయడం, కార్యక్రమాలు, పర్యాటక సదుపాయాలు, వేదికల ప్రణాళిక, పులికాట్ -నేలపట్టు ప్రాంతాల్లో ఏర్పాట్లు పై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఫ్లెమింగో ఫెస్టివల్‌ను రాష్ట్రంలోని ముఖ్య పర్యాటక ఉత్సవంగా నిలబెట్టే విధంగా సంబంధిత విభాగాలు సమన్వయంతో పనిచేయాలని, అన్ని శాఖలు తమ కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేసి వెంటనే సమర్పించాలని సూచించారు.

## వైద్యులు...
# నిజమైన ప్రాణదాతలు!

**-శ్రీ బాలాజీ మెడికల్ కళాశాల తెల్ల కోటు వేడుక**



శ్రీ బాలాజీ మెడికల్ కళాశాల అసుపత్రిలో తెల్లకోటు వేడుక కార్యక్రమం

రేణిగుంట, నవంబర్ 28 ప్రభాతవార్త : రేణిగుంట విమానాశ్రయం వెళ్లే మార్గంలోని శ్రీ బాలాజీ మెడికల్ కళాశాల ఆసుపత్రి రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ నందు శుక్రవారం తెల్ల కోటు వేడుక ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య, విశిష్ట, ప్రత్యేక, గౌరవ అతిథులుగా ప్రముఖ సినీ నటుడు సుమన్, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్ కుమార్, సాయిరాం గ్రూప్స్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ ఛైర్మన్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ సాయి ప్రకాష్ లియో ముత్తు, మదురై ఎయిమ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రొఫెసర్ హనుమంతరావు,ఎండి డాక్టర్ తిరుపతి పాణిగ్రాహి, మేనేజింగ్ ట్రస్టీలు సురేష్ కుమార్ పాణిగ్రాహి, రాకేష్ కుమార్ పాణిగ్రాహి, ఒరిస్సా రాష్ట్రం పర్లకిముండి ఎమ్మెల్యే రూపేష్ కుమార్ పాణిగ్రాహి, కళాశాల డీన్ డాక్టర్ శివానందం, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు వక్తలుగా మాట్లాడుతూ మానవజాతిని బ్రతికించే ఏకైక శక్తి వైద్యులకు మాత్రమే ఉందన్నారు. తల్లిదండ్రులు జన్మనిస్తే వైద్యులు ప్రాణాపాయ స్థితి నుండి కాపాడి పునర్జన్మను ప్రసాదించే అపర ధన్వంతరులని అన్నారు. వైద్య వృత్తిలో అడుగు పెట్టేవారు స్వలాభాన్ని మాని రోగుల సేవ చేయాలని పిలుపునిచ్చారు. రోగుల పట్ల సేవా భావంతో వుండాలని, వైద్యం అందించడంలో డాక్టర్లు మానవతా దృకపథంతో పనిచేయాలన్నారు. ఎంబిబిఎస్ మొదటి సంవత్సరం విద్యను అభ్యసించడం కోసం ప్రప్రథమంగా తెల్ల కోటు ధరించి కాబోయే వైద్యులు విద్యను బాగా అభ్యసించి భవిష్యత్తులో రోగులకు సేవ చేయాలని ఆకాంక్షించారు. మొదటి సంవత్సరం ఎంబిబిఎస్ విద్యార్థులు తెల్లకోటు ధరించడంతో వారి వైద్య ప్రస్థానం ప్రారంభమవు తుందని తెలిపారు. నూతనంగా ఎంబిబిఎస్ కోర్సులో చేరిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో డైరెక్టర్ హెచ్ఆర్ నాగరాజు, జేఈవో డాక్టర్ నవీన్ కుమార్ రెడ్డి, బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు మేళాగారం సుబ్రమణ్యంరెడ్డి, టౌన్ బ్యాంక్ వైస్ ఛైర్మన్ గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

### పుల్లారెడ్డి కండ్రిగ సంఘటనలో...
# సూత్రధారులెవరు... పాత్ర ధారులెవరు?

**-పోలీసులకు సవాలుగా మారిన సంఘటన**

శ్రీకాళహస్తి,నవంబర్ 28 ప్రభాతవార్త
శ్రీకాళహస్తి మండలం, పుల్లారెడ్డి కండ్రిగ గ్రామం శ్రీకాళహస్తి పట్టణానికి సుమారు 6కిలో మీటర్ల దూరంలో ఉంది. గురువారం వేకువ జామున జరిగిన సంఘటనలో వృద్ధ దంపతులైన విద్యావంతుల్ని హతమార్చటానికి గుర్తుతెలియని వ్యక్తులు ప్రయత్నించారు. ఈ సంఘటనలో భార్య జయమ్మ మృతి చెందగా భర్త చెవిరెడ్డి మహాదేవరెడ్డి ఆసుపత్రిలో చికిత్స పొంది డిశ్చార్జ్ అయ్యారు. ఈ కేసుకు సంబంధించి పలు కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కానీ ఎక్కడ పోలీసులకు క్లూదొరకటం లేదని తెలిసింది. మరి ఈ మిస్టరినీ పోలీసులు సవాలుగా తీసుకొని చేధించే పనిలో శుక్రవారం ఉదయం నుంచి పోలీసులు విచారణలో తలమునకలై ఉన్నారు. శ్రీకాళహస్తి మండలం పుల్లారెడ్డి కండ్రిగలో జరిగిన హత్యసంఘటనకు సంబంధించి పోలీసులు విచారణ ముమ్మరం చేసారు. గురువారం ఉదయం డాగ్ స్క్వాడ్‌ను రపించారు. శునకాలు పొలాల్లో కొంత దూరం వెళ్ళి ఆగిపోయాయి. అలాగే గోడల మీద ఉన్న వేలి ముద్రలను తీసుకున్నారు. ఇక శుక్రవారం ఉదయం ఏరియా ఆసుపత్రిలో మృతి చెందిన జయమ్మ పోస్టు మార్టంతో, ఈ కేసుకు సంబంధించి సవాలక్ష ప్రశ్నలకు సమాధానాలు దొరకటం లేదు.

**మహాదేవరెడ్డి ఎందుకు సమాచారం ఇవ్వలేదు?**

శ్రీకాళహస్తిలో జరిగిన సంఘటనలో దుండగులు ఇంట్లో జొరబడి హత్యకు పాల్పడ్డారు. అయితే భార్య భర్తలు ఇద్దరు ఒకే గదిలో ఉన్నారా? లేక వేర్వేరు గదుల్లో ఉన్నారా? భార్యను హతమార్చిన దుండగులు భర్తను ఒక్క కత్తిపోటుతోనే వదలి పెట్టారా? తెల్లవారు జామున 3గంటలకు ఈ సంఘటన జరిగితే, ఉదయం పని మనిషి వచ్చి తలుపుతట్టే వరకు మహాదేవరెడ్డి ఎందుకు తలుపు తీయలేదు? ఎందుకు చరవాణి ద్వారా సమాచారం అందించలేదన్నది అంతుపట్టకుంది. ఇక మహాదేవరెడ్డి కుమారుడు శ్రీకాళహస్తి పట్టణంలో విద్యాసంస్థలు నిర్వహిస్తున్నారు. ఇక ఈ సంఘటనకు సంబంధించి చుట్టుపక్కల గ్రామస్తులు కూడా ఎలాంటి సమాచారం ఇవ్వటం లేదు.

**రంగంలో దిగిన పోలీసులు:**

పుల్లారెడ్డి కండ్రిగలో జరిగిన సంఘటనకు సంబంధించి శుక్రవారం పోలీసులు పలు కోణాల్లో విచారణ జరుపుతున్నారు. ముఖ్యంగా హత్యకు గురైన దంపతుల కుమారుడు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు. వీరి మధ్య ఏమైనా తగాదాలు ఉన్నాయా? అయితే ఆతని మీద పగ తల్లిదండ్రుల మీద తీర్చుకుంటే ప్రయోజనం ఏమిటి?పోలీసులు శుక్రవారం బంధువుల మధ్య ఆస్తి తగాదాలు ఉన్నాయా? అంతేకాక పలువురిని విచారించినట్లు తెలిసింది. అలాగే ఉదయం వచ్చి తలుపు తట్టిన పని పనిషిని విచారణ జరిపారు. ఇక వీరి వద్ద ఐదారుగురు కారు డ్రైవర్లు పని చేస్తుంటారు. వారిలో రెగ్యూలర్‌గా ఉండే ఓ వ్యక్తిని విచారణ జరుపుతున్నారు. ఎవరిని ఎన్ని కోణాల్లోంచి విచారించినా పోలీసులకు ఎక్కడా చిన్న క్లూ కూడా దొరకటం లేదని తెలిసింది. ఓ వైపు డివైయస్‌పి నరసింహామూర్తి, మరో వైపు ఇన్‌చార్జి సిఐ నాగార్జున్‌రెడ్డి, రూరల్ పోలీసులు రంగంలో దిగి పలుకోణాల్లో విచారన చేపట్టారు. అంతేకాక బాధితుడు కత్తిపోట్లకు గురైన మహాదేవరెడ్డిని కూడా విచారించారు. అయితే ఆయన పొంతన లేని సమాధానం చెబుతున్నట్లు సమాచారం. ఆయన తనకు తెలుసునని తమ పక్కన పొలం వాడని చెప్పినట్లు సమాచారం. దాంతో పోలీసులు ఏం చేయాలో ఈ కేసులో మిస్టరిని ఎలా ఛేదించాలో అర్థం కాని పరిస్థితితో, తమ సమర్థతను చాటుకొనుటకు అన్ని కోణాల నుంచి విచారణ జరుపుతున్నారు.ఇక గ్రామంలో ఎవరైనా కనబడటం లేదా? అని పరిశీలిస్తున్నారు.

# తిరుచ్చిపై విహరించిన శ్రీమహాలక్ష్మి



తిరుచానూరు, నవంబర్ 28 ప్రభాతవార్త :తిరుచానూరులో పద్మావతి అమ్మవారు తిరుచ్చిపై తిరుమాడ వీధులలో విహరిస్తూ భక్తులకు అభయమిచ్చారు. ప్రతి శుక్రవారం సేవలో భాగంగా పద్మావతి అమ్మవారిని సుప్రభాతంతో మేలు కొలుపు సహస్రనామార్చన నిత్య నిర్వహించారు. అనంతరం ఆలయ ముఖమండపం వద్ద కల్యాణోత్సవం వైభవంగా చేపట్టారు. తరువాత అమ్మవారిని ఉద్యానవనంకు వేంచేపుగావించి వైభవంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. అనంతరం వాహన మండపం వద్ద పద్మావతి అమ్మవారిని సుందరంగా అలంకరించి తిరుచ్చిపై కొలువుతీర్చి తిరుమడ వీధులలో ఊరేగించారు. స్థానికులు భక్తులు పెద్ద ఎత్తున కర్పూర నీరాజనాలతో అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ దేవరాజులు, సూపరింటెండెంట్ రమేష్, ఏవీఎస్ఓ రాధాకృష్ణమూర్తి, ఆర్జిత ఇన్స్పెక్టర్ చలపతి, వాహనం ఇన్స్పెక్టర్ సుభాస్కర్, ప్రసాదం ఇన్స్పెక్టర్ సుబ్బరాయుడు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# కాలుష్య రహిత పుణ్యక్షేత్రం

**-ఇక తిరుమల ఘాట్‌లో విద్యుత్ వాహనాలే -టిటిడి అదనపు ఈఓ వెంకయ్యచౌదరి**



తిరుమల, నవంబర్28 ప్రభాతవాం ప్రతినిధి: సప్తగిరులు తిరుమలను కాలుష్య రహిత పుణ్యక్షేత్రంగా తీర్చిదిద్ద డమే ముందున్న లక్ష్యమని టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ఉద్ఘాటించారు. ఇప్పటికే తిరుమలకు విద్యుత్ వాహనాలు నడుస్తున్నా ఇంకా రానున్న రోజుల్లో పూర్తిస్థాయిలో ట్యాక్సీలు, ఇతర అద్దెవాహనాలను, ఆర్టీసి బస్సులను విద్యుత్‌తో తిరిగేలా చూస్తామన్నారు. తిరుమల ఘాట్‌లో పర్యావరణ పరిరక్షణతోబాటు కాలుష్యనియంత్రణ ధ్యేయంగా విద్యుత్ వాహనాలను నడపాలని సిఎం చంద్రబాబునాయుడు నిర్ధేశించారన్నారు. ఆయన ఆదేశాలతో పర్యావరణ పరిరక్షణలో ఇప్పటికే అనేక చర్యలు తీసుకున్నా మన్నారు. 50వరకు ఆర్టీసి విద్యుత్ బస్సులు ఘాట్‌లో తిరుగుతున్నాయని, టిటిడి అధికారుల వాహనాలు విద్యుత్‌తో నడిచేవి వినియోగిస్తున్నారన్నారు. రానున్న రోజుల్లో డీజిల్, పెట్రోల్‌తో నడుస్తున్న వాహనాలస్థానంలో విద్యుత్‌తో నడిచేవి ఘాట్‌లో నడపాలని ఆదేశించారు. విద్యుత్ వాహనాల వినియోగంపై శుక్రవారం తిరుమల పద్మావతి అతిథిగృహంలో కేంద్ర రహదారుల మంత్రిత్వశాఖ (కొత్తఢిల్లీ)సీనియర్ కన్సల్టెంట్ ప్రతినిధులు కునాల్‌జోష్, టిటిడి డిఎఫ్ఓ ఫణికుమార్ నాయుడు, తిరుమల అదనపు ఎస్పీ ఐ.రామకృష్ణ, తిరుపతి జిల్లా రవాణాఅధికారి కొర్రపాటి మురళీమోహన్, విఎస్ఓ సురేంద్ర, ఐటి డిప్యూటీ జిఎం వెంకటేశ్వర్లునాయుడు,ఆర్టీసి అధికారులు,రవాణా శాఖ అధికారులతో సమీక్షించారు.

## చిన్నసింగమాలలో పారిశుద్ధ్యం పనులు



తొట్టంబేడు,నవంబర్ 28 ప్రభాతవార్త: మండలం లోని చిన్నసింగమాల పంచాయతీ పరిధిలో శుక్రవారం సర్పంచ్ మాధవి సారథ్యంలో పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. రాబోవు వర్షాకాలం సందర్భంగా ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులు, స్థానిక శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి పంచాయతీ అధికారులు, నాయకులను ఆదేశించటంతో తుఫానుకు ముందే ముందస్తు చర్యలు తీసుకున్నట్లు సర్పంచ్ తెలిపారు. పంచాయతీలోపేరుకు పోయినచెత్తలను ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ కార్యక్రమాలను సర్పంచ్ మాధవి, పంచాయతీ అధికారి శరత్‌లు పర్యవేక్షించారు.

## కొణతనేరిలో అన్నదాత సుఖీభవ



తొట్టంబేడు,నవంబర్ 28 ప్రభాతవార్త : మండలంలోని కొణతనేరి పంచాయతీలో శుక్రవారం పార్టీ సీనియర్ నాయకుడు మురళి నాయుడు సారథ్యంలో అన్నదాత సుఖీభవ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా మురళి నాయుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల అమలులో ఎంతో పారదర్శకతతో అమలు చేస్తున్నారని వివరించారు. యూరియా సరఫరాకు సంబంధించి ప్రభుత్వం వవెంటనే స్పందించి చర్యలు తీసుకొని విడుదల చేసారన్నారు.ంరైతు భరోసా నిధులు వివిధ బ్యాంకుల్లో జమ అయ్యాయన్నారు. ఈ కార్యక్రమాల్లో దాసినేని బోసు నాయుడు, రాజేంద్రనాయుడు, చలపతి నాయుడు, కిషోర్; హరినాయుడు, చిన్ననాయుడు,మనోహర్ చంద్రశేఖర్‌నాయుడు, సుమతి, సచివాలయ వ్యవసాయాధికారి పవన్,శరణ్య తదితరులు పాల్గొన్నారు.

## పూసల వీధిలో జ్యోతిరావుపూలే కు పూజలు



శ్రీకాళహస్తి,నవంబర్ 28 ప్రభాతవార్త : పట్టణంలోని పూజల వీధి కూడలిలో రాష్ట్ర బిసి సంఘ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ యం. ఉమేష్‌రావు సారథ్యంలో మహాత్మాజ్యోతిరావుపూలే 135వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. పూలే తన అనుచరులతో కలసి బలహీన వర్గాల వారికి సమాన హక్కులను సాధించాలన్నా లక్ష్యంతో సత్యశోధక్ సమాజ్‌ను ఏర్పాటు చేసి అణగారిన వర్గాల అభ్యున్నతికి అనేక కార్యక్రమాలను నిర్వహించి జాతీయ స్థాయిలో సామాజిక ఉద్యమానికి నాంది పలికారన్నారు. ఈ కార్యక్రమాల్లో వన్నెకుల క్షత్రియుల సంఘం అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల రవి, తంగేళ్ళ పాలెం సింగిల్ విండో అధ్యక్షుడు బీమాల బాస్కర్ ముదిరాజ్, శ్రీకాళహస్తి టౌన్‌బ్యాంకు మాజీ చైర్మెన్ డివి నారాయణ, వజ్రం కిషోర్, కోట చంద్రశేఖర్, గాజుల భగత్, సయ్యద్ చాన్‌బాషా, సంజాకుల మురళికృష్ణ,మణి, కృష్ణమూర్తి, మురళీనాయుడు, గంగనపల్లి రమేష్, చంద్రబాబు, శేషు, పాస్టర్‌మధు,రియాజ్, గోవర్ధన్, దండపాణి, అనంద్‌మేస్త్రీ తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల గడువు...

*మరో రెండు నెలల పొడిగింపు : జిల్లా కలెక్టర్*



*తిరుపతి కలెక్టరేట్, నవంబర్ 28 ప్రభాతవార్త :* ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల గడువు ముగుస్తున్న నేపథ్యంలో రాష్ట్రంలోని జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల కాలపరిమితిని మరో రెండు నెలలు పాటు డిసెంబర్ 1 2025 నుండి 31 జనవరి .2026 వరకు పొడిగింపు ఉత్తర్వులు జారీ చేస్తూసమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు కె.ఎస్ విశ్వనాథన్ శుక్రవారం నాడు ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో ప్రస్తుతం నవంబర్ 30, 2025 నాటికి అక్రిడిటేషన్ కార్డులు కలిగి పనిచేయుచున్న పాత్రికేయులకు మాత్రమే 1 డిసెంబర్ 2025 నుండి 31 జనవరి 2026 వరకు పొడిగింపు సౌకర్యం కొనసాగుతుందని, సంబంధిత మీడియా యాజమాన్యం వారు వారి సంస్థలో పని చేయుచున్న జర్నలిస్టుల వివరాలు జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి, తిరుపతి వారి కార్యాలయంలో వీలైనంత తొందరగా అందచేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ తెలిపారు.

## పశు వైద్యకలాశాల విద్యార్థినికి ప్రథమ బహుమతి



తిరుపతి విద్య నవంబర్ 28 ప్రభాత వార్త: తిరుపతి పశువైద్య కళాశాల నాల్గవ సంవత్సర విద్యార్థిని అవాలిన్ ప్రియదర్శిని హైదరాబాద్ నందు ప్రతిష్టాత్మకంగా నిర్వహించబడుచున్న పౌల్ట్రీ ఎక్స్పో సదస్సు నందు కోళ్ళ లో సంక్రమించే కాకిడియోసిస్ అని వ్యాధి నివారణకు సహజ ఆహార యాజమాన్య పద్ధతులు అను వ్యాసానికి ప్రథమ బహుమతి లభించింది. ఈ యొక్క వ్యాస రచన పోటీ కి దేశం నలుమూలల నుంచి మొత్తం 95 మంది పోటీ పడగా అవాలిన్ కి ప్రథమంగా నిలిచింది.ఈ సందర్భంగా కళాశాల అసోసియేట్ డీన్ డా. జగపతి రామయ్య విద్యార్థి ని ప్రశంసించారు.

## పూలే ఆదర్శవంతమైన సంస్కర్త




తిరుపతి విద్య, నవంబర్ 28 ప్రభాతవార్త: ఎస్వీయు లో మహాత్మా జ్యోతిరావు పూలే 135 వ వర్ధంతి సభ నిర్వహించడం జరిగింది. యస్వీయూ ఉపకులపతి ఆచార్య టాటా నర్సింగరావు, రెక్టార్ ఆచార్య అప్పారావు అతిథులుగా హాజరయ్యారు. ముందుగా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఉపకులపతి మాట్లాడుతూ మహాత్మా పూలే భారత దేశానికి గర్వకారణమైన సంఘ సంస్కర్త అని,అణగారిన వర్గాల విద్య కోసం,స్త్రీ అభ్యున్నతి కోసం,బాలికల చదువుకోసం జీవితకాలం శ్రమించారని అన్నారు. కాలేజి డెవలప్మెంట్ డీన్ ఆచార్య చంద్రాయుడు ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఆచార్య శ్యాం మోహన్ డేవిడ్ రాజు,ఆచార్య శ్రీనివాసులు,డాక్టర్ ఆదినారాయణ,డాక్టర్ అంజన్ సింగ్ ,ఉద్యోగులు,పరిశోధకులు, లా విద్యార్థులు పాల్గొన్నారు.

## మహాత్మా పూలేకు ఎమ్మెల్యే ఘన నివాళి



తిరుపతి విద్య, నవంబర్ 28 ప్రభాతవార్త: మహాత్మా జ్యోతిరావు పూలే 135వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం ఉదయం మ్యూజిక్ కాలేజీ సర్కిల్ లో పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు నివాళులు అర్పించారు. బిసి నాయకులతో కలిసి పూలే వర్ధంతి కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆరణి పాల్గొన్నారు. కుల నిర్మూలన, దిగువ కులాల ప్రజల సమాన హక్కుల కోసం జీవితాంతం పోరాడిన గొప్ప సంఘసంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. ఆనాటి సమాజంలోని దురాచారాలకు వ్యతిరేకంగా పోరాడి ప్రజల్లో చైతన్యం కోసం ఎన్నో కష్టనష్టాలను భరించిన తత్వవేత్త పూలే అని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బీసీ సంఘర్షణ సమితి సమన్వయకర్త అశోక్ సామ్రాట్ యాదవ్, అధ్యక్షుడు అక్కినంపల్లి లక్ష్మయ్య,ప్రధాన కార్యదర్శి సాకం ప్రభాకర్,ఉపాధ్యక్షులు రమణ, సుబ్రమణ్యం యాదవ్,రామయ్యా , ఏపీ రజక కార్పొరేషన్ డైరెక్టర్ కరాటే చంద్ర,కాపు కార్పొరేషన్ డైరెక్టర్‌వరప్రసాద్,జనసేననగర అధ్యక్షులు రాజా రెడ్డి, రాజేష్ అచ్చారి , కూరపాటి సురేష్ పాల్గొన్నారు.

## మోటారు సైకిల్ చోరీపై ఫిర్యాదు

విజయపురం, నవంబరు 28 ప్రభాతవార్త: మండలంలోని గొల్లకండ్రిగ దళితవాడకు చెందిన మహేంద్రన్ మోటారు సైకిల్ చోరీపై శుక్రవారం నగరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. నగరి ఏరియా ఆస్పత్రి ఆవరణలో ద్విచక్రవాహనం నిలిపి ఆస్పత్రిలో చికిత్స చేసుకుంటున్న సమయంలో చోరీకి ఏపీ 03 ఏజే 9696 నంబరు గల మోటారు సైకిల్ చోరీకి గురైందని, పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరారు.

## మహాత్మ జ్యోతిరావు పూలే 135వ వర్ధంతి



తిరుపతి విద్య నవంబర్ 28 ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ బి సి విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పర్చూరు నారాయణ గౌడ్ ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతి కార్యక్రమాన్ని ఆఫీసర్స్ అండ్ క్లబ్ నందు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్ వి యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య నర్సింగరావు మాట్లాడుతూ పూలే మహిళా విద్య కోసం తన సతీమణి సావిత్రిబాయి పూలేకి విద్య నేర్పి పూణేలో మొదటిసారిగా మహిళా పాఠశాల నెలకొల్పారు. రెక్టార్ ఆచార్య అప్పారావు మాట్లాడుతూ పూలే సమ సమాజ స్థాపన కోసం అనేక త్యాగాలు చేసి సమాజంలో చైతన్యానికి నాంది పలికారు అన్నారు. సుప్రీంకోర్టు ప్రముఖ న్యాయవాది పూలే అంబేద్కర్ అవార్డు గ్రహీత డాక్టర్ అంబేద్కర్ గ్లోబల్ లా ఇన్స్టిట్యూట్ చైర్మన్ డాక్టర్ తిప్పారెడ్డి మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని రచించిన అంబేద్కర్ తన గురువుగా పూలేని స్వీకరించడం గొప్ప ఆదర్శమన్నారు. టీటీడీ బోర్డు మెంబర్ జంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ దేశ మరియు రాష్ట్రవ్యాప్తంగా పూలే వర్ధంతి వేడుకలను జరుపుకోవడం చాలా సంతోషకరమన్నారు. చిత్తూరు జడ్పీ డిప్యూటీ సీఈవో డాక్టర్ వెంకటనారాయణ మాట్లాడుతూ సమాజంలో కుల వ్యవస్థను మొదటిసారిగా ప్రశ్నించిన వ్యక్తి పూలే అన్నారు. సిమ్స్ డాక్టర్ శివ శంకర్ మాట్లాడుతూ ఇటువంటి గొప్ప ఆదర్శ వ్యక్తులు గురించి సమాజానికి తెలియజేయడం ఆనందదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పుచ్చపల్లి నాగరాజు ప్రియవర్ధన్ బాబు, చిరంజీవి, నాగ వర్ధన్, క్రాంతి కుమార్, వినయ్ దితరులు పాల్గొన్నారు.

## పరిష్కార వేదికకు విశేష స్పందన



భాకరాపేట,నవంబర్ 28 ప్రభాతవార్త: చిన్నగొట్టిగల్లు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే పులివర్తి నాని చేపట్టిన రెవెన్యూ సమస్యల పరిష్కార వేదికకు విశేష స్పందన లభించింది. భూ సమస్యలపై ప్రజల నుండి అర్జీలు వెల్లువెత్తాయి. రైతులకు సంబంధించిన భూముల ఆన్‌లైన్ సమస్యలు, దారి సమస్యలు, మ్యుటేషన్ సమస్యలపై ఎక్కువ అర్జీలు సమర్పించారు. అధికారులను దగ్గర ఉంచుకొని రికార్డులను పరిశీలించి అక్కడికక్కడే పలు సమస్యలను ఎమ్మెల్యే పరిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలను పరిష్కారమే ప్రధాన ధ్యేయం అన్నారు. రెవిన్యూ సమస్యలతో వచ్చిన ప్రతి అర్జీదారుడికి అధికారులు రసీదులు ఇచ్చి వారికి తగిన న్యాయం జరిగేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ భాగ్యలక్ష్మి, ఎంపీడీవో గిడ్డియ్య, డిప్యూటీ ఎంపీడీఓ సోమశేఖర్ రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షులు బెల్లంకొండ మురళి, క్లస్టర్ ఇంచార్జి కొట్టే శివ కుమార్, సింగిల్ విండో అధ్యక్షులు ముత్తం ప్రభాకర్, రమణారెడ్డి,మదన్మోహన్, మోహన్ రెడ్డి, మల్లికార్జున రెడ్డి,రమేష్ తదితరులు పాల్గొన్నారు

## విరుపాక్షమ్మా ఆలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



భాకరాపేట, నవంబర్ 28 ప్రభాతవార్త: చిన్నగొట్టిగల్లు లో నూతనంగా నిర్మితమైన విరుపాక్షమ్మా ఆలయ ప్రారంభ మహోత్సవం ఘనంగా జరిగింది ముఖ్య అతిధిగా హాజరైన ఎమ్మెల్యే పులివర్తి నానికి అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు అనంతరం నిర్వహించిన ప్రత్యేకపూజలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు

## మనలోని లోపాలను గుర్తించి పరిష్కరించుకోవాలి!



శ్రీకాళహస్తి,నవంబర్ 28 ప్రభాతవార్త: నేటి సమాజంలో మనం పరుల లోపాలను ఎత్తిచూపటం తప్ప మనలోని లోపాలను గుర్తించకపోవటం వల్ల ఎన్నో అనర్థాలు చోటు చేసుకుంటున్నాయని హాఫీజే ఖుర్‌ఆన్ రేహాన్ సాహెబ్ అన్నారు. శుక్రవారం జామియా మస్జిద్‌లో ప్రత్యేక ప్రార్థనల తరువాత ఆయన మాట్లాడుతూ ఇస్లాం మతం,దీన్ మంచిని నేర్పుతుందని ఎదుటి వారి లోపాలను వెతకటం కన్నా తనను తాను సంస్కరించుకోవాలని సూచిస్తుందన్నారు. అల్లాహ్ మనిషిని మంచి, చెడుల సంయోగమనంతో సృష్టించాడని అయితే మనం మంచి దారిని ఎంచుకోవాలన్నారు. మొదట మనం మనల్ని సంస్కరించుకుంటూ కుటుంబాన్ని సంస్కరింఆలన్నారు. ఇలా ప్రతి ఒక్కరు తమను తాము సంస్కరించుకుంటూ కుటుంబాలను సంస్కరించుకుంటే సమాజం బాగుం టందన్నారు.

## నిత్యాన్న పథకానికి విరాళం



శ్రీకాళహస్తి,నవంబర్ 28 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి సంబంధించి భక్తుల నుంచి విరివిగా విరాళాలు అంతు తున్నాయి.ఈ నేపథ్యంలో శుక్రవారం హైదరాబాదుకు చెందిన భక్తులు రూ.1లక్ష విరాళాన్ని అందించారు. హైదరాబాదుకు చెందిన రాజేంద్ర ప్రసాద్, స్వరూపా రాణి దంపతులు కుటుంబసభ్యులో స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. విరాళం ఇవ్వాలని ఎఇఓ మోహన్‌కు వివరించారు. ఈ కార్యక్రమాల్లో ఎపిఆర్ఓ రాజేష్ పాల్గొన్నారు.

## శివయ్య పథకాలకు చెన్నై వాసుల విరాళం




శ్రీకాళహస్తి,నవంబర్ 28 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదానం, గోసరంక్షణ పథకాలకు భక్తుల నుంచి విరివిగా విరాళాలు అందుతున్నాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం చెన్నైకు చెందిన భక్తులు డాక్టర్ రాజ్‌కుమార్,రాజీ దంపతులు కుటుంబసభ్యులతో స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. వారు నిత్యాన్నదాన పథకానికి రూ, 75,700లు, అలాగే దేవస్థానం చే నిర్వహిస్తున్న గోశాలలో గోవుల సంరక్షణకు రూ.10వేలు వెరసి 87,700ల చెక్కును దేవస్థానంకు అందించారు. ఈ కార్యక్రమాల్లో దాతలతో పాటు ఎఇఓ మోహన్, స్థానికులు శశిధర్ తదితరులు పాల్గొన్నారు.

## ఇరుగుపొరుగు వారి హక్కులపై ఉద్యమం



శ్రీకాళహస్తి,నవంబర్ 28 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి లోని ఇస్లామి హింద్ సంస్థ చే శుక్రవారం ఇరుగు పొరుగు వారి హక్కుల గురించి ఉద్యమాన్ని చేపటారు.ఈ సందర్భంగా వారు పట్టణంలోని పాఠశాల ల్లోనూ, కూడలి ప్రాంతాల్లో పట్టణం లోని పలువురు ప్రముఖులను కలసి అవగాహనకు కరపత్రాలను పంచటం జరిగింది. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ నేడు సమాజంలో మానవ సంబంధాలు తెరమరుగౌతున్నాయన్నారు. సమాజంలో నైతిక విలువలు సన్న గిల్లాయన్నారు.అందుకే శ్రీకాళహస్తిలో పది రోజులపాటు అవగాహనకు ఉద్యమం చేపట్టినట్లు వివరించారు. ఈ కార్యక్రమాల్లో జమాతే ఇస్లామి హింద్ తిరుపతిజిల్లా ఉపాధ్యక్షుడు షేక్ అమీర్‌బాషా,,పట్టణ అధ్యక్షుడు షేక్ మహమ్మూద్ సభ్యులు ఎం.ముజ్మిల్‌అహమ్మద్,షబ్బీర్, దావూద్, గౌస్ మొహిద్దీన్, అబ్దుల్ నాశిర్, అబూబకర్ తదితరులు పాల్గొన్నారు.

## జయమ్మ పాడే మోసిన ఎంపి,మాజీ ఎంఎల్ఏ



శ్రీకాళహస్తిరూరల్,నవంబర్ 28 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి మండలం పుల్లారెడ్డి కండ్రిగలో గురువారం జరిగిన దారుణ హత్యసంఘటనలో మృతి చెందిన మండల వైకాపా నాయకుడు,విద్యాసంస్థల అధినేత చెవిరెడ్డి మధుసూధనరెడ్డి తల్లి జయమ్మ మృతదేహానికి పోస్టుమార్టం జరిపి శుక్రవారం శవాన్ని అప్పగించారు. జయమ్మ అంతిమ యాత్రకు కుమారుడు మధుసూధనరెడ్డి కొరివి పెట్టగా శవం పాడెను ఎంపి మద్దెల గురుమూర్తి, మాజీ శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి మోసారు. ఈ సందర్భంగా వారు కుటుంబ సభ్యులను ఒదార్చారు. ఈ ప్రాంతంలో ఎప్పుడూ జరగరాని సంఘటన జరిగిందని అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమాల్లో మాజీ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు, బ్రెసుదర్శనం రెడ్డి, చంద్రారెడ్డి, రవీంద్ర్‌రెడ్డి, పి.చంద్రారెడ్డి, శేఖర్‌రెడ్డి, గంగిరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి,శివా రెడ్డి, సుబ్బారెడ్డి, నాగరాజు రెడ్డి, చెంచ్యనాయుడు, సుమన్‌రెడ్డి, సురేష్, మున్నారాయల్, బుల్లెట్‌శ్యామ్ రాయల్,యశ్వంత్‌రెడ్డి నాయకులు కార్యకర్తలు హాజరయ్యారు.

## పరశురామేశ్వరుని ఆలయ క్యాలండర్ల ఆవిష్కరణ



శ్రీకాళహస్తిరూరల్,నవంబర్ 28 ప్రభాతవార్త : ఏర్పేడు మండలంలోని గుడిమల్లంలో వెలసిన ఆనంద వల్లి సమేత పరశురామేశ్వరుని ఆలయ క్యాలండర్లను శుక్రవారం శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి ఆవిష్కరిం చారు. ప్రపంచ ప్రసిద్ది చెందిన గుడిమల్లం ఆలయానికి సంబంధించి విస్తృత స్థాయిలో ప్రచారం జరగాలని ఎంఎల్ఏ అభిప్రాయపడ్డారు. ఈ ఆలయ ప్రాశస్త్యంకు సంబంధించి తాను ప్రభుత్వ పరిధిలో చర్యలు తీసుకుంటున్నా మన్నారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమాల్లో మాజీ చైర్మెన్ బత్తల గిరి నాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు పేరం నాగరాజునాయుడు శ్రీకాళహస్తి మార్కెట్ కమిటి చైర్మెన్ చెంచయ్య నాయుడు, తెలుగుదేశం పార్టీ నాయకులు మోహన్‌రెడ్డి, పద్మనాభనాయుడు, నవీన్ ఆలయ ఇఓ రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జ్యోతిరావుపూలే ఆశయాలను కొనసాగిద్దాం



శ్రీకాళహస్తిరూరల్,నవంబర్ 28 ప్రభాతవార్త: బడుగుబలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేద్దామని బిసి సంఘ రాష్ట్రాధ్యక్షులు వడ్లతాంగాళ్ బాలాజి ప్రసాద్‌రెడ్డి అన్నారు. శుక్రవారం శ్రీకాళహస్తి మండ లంలోని తిరుమంజనం వారి కండ్రిగలో ఏర్పాటు చేసిన పూలే 135 వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వ హించారు.ఈ కార్యక్రమాల్లో బిసి సంఘం నేతలు మునిరామిరెడ్డి, గోవర్ధన్, మోహన్,బలరామిరెడ్డి,దిబ్బారెడ్డి పాల్గొన్నారు.

## గుడిమల్లం ఆలయంలో డాలర్ పూజలు

శ్రీకాళహస్తిరూరల్,నవంబర్ 28 ప్రభాతవార్త:



ఏర్పేడు మండలంలోని గుడిమల్లంలో వెలసిన ఆనం దవల్లి సమేత పరశురామేశ్వరాలయంలో శుక్రవారం తుడా చైర్మెన్ డాలర్ దివాకర్‌రెడ్డి కుటుంబసభ్యులతో పూజలు జరుపుకున్నారు. ఆలయ ప్రధాన ద్వారం వద్ద వేదపండితులతో స్వాగతం చెప్పారు.స్వామి అమ్మవార్ల దర్శనం తరువాత వారికి వేదపండితుడు వంశీ ఆశీర్వదించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి రామచంద్రారెడ్డి సారథ్యంలో తీర్థ ప్రసాదాలు అందించారు.

# తిరుపతి డివిజన్

## పూలే...అంటరానితనం నిర్మూలనకు విశేష కృషి



చంద్రగిరి, నవంబర్ 28 ప్రభాతవార్త: అంటరానితనం, కుల వ్యవస్థ నిర్మూలన, మహిళోద్ధరణకు మహాత్మ జ్యోతీరావ్ పూలే విశేష కృషి చేసినట్లు సంగీతం విశ్వనాథ్, కె.వెంకటముని తెలిపారు. స్థానిక టవర్ క్లాక్ వద్ద శుక్రవారం జ్యోతీరావ్ పూలే వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అదేవిధంగా వితంతువుల కోసం గృహాన్ని స్థాపించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పూలే ఆశయ సాధన కమిటీ గౌరవ అధ్యక్షుడు సి.ఎం.కేశవులు, ప్రధాన కార్యదర్శి రాగూరి చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు మాజీ సర్పంచ్ మురగయ్య, టి.సుబ్రమణ్యం యాదవ్, మునిరాజు, దొరస్వామి, వెంకటాద్రి, టి.ఏ.ప్రసాద్, నరేష్‌కుమార్ నాయుడు, బాలకృష్ణయ్య, ఎస్.రామ్మూర్తి, మన్సూర్, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ సమాఖ్యల బలోపేతమే మహిళా శక్తికి బాట



తిరుపతిరూరల్, నవంబర్ 28 ప్రభాతవార్త: గ్రామ సమాఖ్యలు బలంగా నిలవా లంటే... మహిళలు అన్ని రంగాలలో అభివృద్ధి సాధించాలని తిరుపతిరూరల్ ఎంపిడిఓ దయాసాగర్ సూచించారు. శుక్రవారం మండల సమాఖ్య అధ్యక్షరాలు అధ్యతన జరిగిన సమావేశంలో ఎంపిడిఓ మాట్లాడారు. సమాఖ్యలు శక్తివంతంగా ఉన్న గ్రామాల్లో మహిళలు అప్రతిహతంగా ఎంటర్‌ప్రెన్యూర్లుగా ఎదుగుతున్నారని తెలిపారు. ప్రతి సంఘ సభ్యురాలు డిజిటల్ లావాదేవీలను మాత్రమే ప్రోత్సహించి, ఆర్థిక అవకతవకలకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఏపిఎం పత్తిపాటి నాగేశ్వరరావు, గ్రామ సమాఖ్య లీడర్లు, సిసిలు పాల్గొన్నారు.

## మురుగు పారుతున్నా పట్టించుకోరా!

కేవీబీ పురం, నవంబరు 28 ప్రభాతవార్త: మండలంలోని రాగిగుంట పంచాయతీలోని మర్రిగుంట ప్రధాన మార్గంలో అడుగు లోతు బురదపేరుకు పోయి అడుగు మార్చలేనంత దారుణంగా మారింది. గ్రామానికి మొదటి మార్గమైన ఈ దారిలో బురద పేరుకుపోవడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా వృద్ధులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. మరుగు, బురద రోజు రోజుకు పేరుకుపోతుండడంతో భరించలేని దుర్గంధం వెదజల్లుతుందని, దోమలు పెరిగి రోగాలు ప్రభలుతున్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయాన్ని సంబంధిత అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని మర్రిగుంట పేరుకుపోతున్న బురదను తొలగించి, బ్లీచింగ్ చల్లించాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై ఎంపీడీవో మాలతిని వివరణ కోరగా విషయం తన దృష్టికి రాలేదని తక్షణమే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## కేవీబీపురంలో ఓంశక్తి ఆలయ కుంభాభిషేకం



కేవీబీ పురం, నవంబరు 28 ప్రభాతవార్త: కేవీబీ పురం మండల కేంద్రంలో ఆధ్యాత్మికోత్సాహంతో కళ కళలాడింది. నూతన ఓంశక్తి ఆలయంలో నిర్వహించిన మహా కుంభాభిషేకం భక్తజనాలు, గ్రామస్తులు సందోహంతో ఘనంగా సాగింది. ఉదయం ప్రారంభమైన మంత్రోచ్చారణలు, వేద ఘోషలు, హోమాలు ఆలయ పరిసరాలను పవిత్రతో నింపాయి. ఆధ్యాత్మిక చైతన్యంతో నిండిన ఈ వేడుక కేవీబీ పురానికి మరింత ప్రత్యేకతను తెచ్చిపెట్టిందని గ్రామస్తులు అన్నారు.

## లీకేజీ పట్టించుకోని అధికారులు



పుత్తూరు రూరల్, నవంబరు 28 ప్రభాతవార్త: పుత్తూరు పట్టణ కార్వేటినగరం రోడ్డు, జెండామాను వీధి, బజారు వీధి సర్కిల్లో తాగునీటి పైపులైన్ లీకేజీ కావడంతో తాగునీరు కలుషితం అవుతోంది. పది రోజులు గడుస్తున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఇలాగైతే నీరు కలుషితమై ప్రజలు రోగాలు బారిన పడతారని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి త్వరితగతిన సమస్యను పరిష్కరించవలసిందిగా ప్రజలు కోరుతున్నారు.

## కదిరివేలుపై చర్యలు తీసుకోవాలి

పుత్తూరు రూరల్, నవంబరు 28 ప్రభాతవార్త: పుత్తూరు మండలం గోపాలకృష్ణాపురం గిరిజనులు సాగులో ఉన్న భూమిపై కదిరివేలు మొదలియార్‌పై చర్యలు తీసుకోవాలని సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో పుత్తూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమంలో సీపీఎం తిరుపతి జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు ముఖ్య అతిథిగాపాల్గొని మాట్లాడుతూ గత 50 ఏళ్లుగా గోపాలకృష్ణాపురం గిరిజనులు సాగులో ఉన్న భూమిపై అక్రమంగా పట్టాలు సృష్టించి రిజిస్ట్రేషన్ చేయించిన పుత్తూరు పట్టణానికి చెందిన కదిరివేలు మొదలియార్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ వెంకటేశ్వరులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నారాయణవనం మండల నాయకులు మునిశంకర్, నందయ్య, సుబ్రహ్మణ్యం పురుషోత్తం, నాగభూషణం, కాంతారావు, గోపి, గంగాధరం, రాఘవమ్మ, సుబ్బలక్ష్మి, చంగమ్మ, గిరిజనులు పాల్గొన్నారు.

## కార్యకర్తకు నివాళులర్పించిన గంజి



పుత్తూరు రూరల్, నవంబరు 28 ప్రభాతవార్త: పుత్తూరు మండలం దిగువ కృష్ణ సముద్రం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు శాంతకుమార్ అన్న ఏసువరం శుక్రవారం మృతి చెందాడు. ఈ మృతదేహానికి ఆంధ్రప్రదేశ్ పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజిమాధవయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. రూరల్ పార్టీ అధ్యక్షుడు బాలాజీ, ప్రధాన కార్యదర్శి హేమంత్‌కుమార్, త్యాగరాజు, అనంతరాజు, పాల్‌రాజు, జయకుమార్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా : కూరపాటి



సత్యవేడు, నవంబరు 28 ప్రభాతవార్త: తిరుపతి జిల్లా వరదయ్యపాళెం మండలంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజా దర్బార్ కార్యక్రమం సత్యవేడు నియోజకవర్గంలో ప్రతిష్టమకంగా జరుగుతుంది. శుక్రవారం నిర్వహించే ప్రజా దర్బార్ వరదయ్యపాళెంలోని కేబీజే ప్యాలెస్‌లో టీడీపీ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ కూరపాటి శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ప్రజా దర్బార్‌లో ప్రజలు ఇచ్చిన అర్జీలను తీసుకుని సమస్యలను క్షుణ్ణంగా అడిగి తెలుసుకుని సమస్య పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారు. శంకర్‌రెడ్డి, ప్రజా దర్బార్‌లో సుమారు 200 వరకు అర్జీలు అందాయి. ప్రధానంగా రోడ్లు, డ్రైనేజీ, రెవెన్యూ, హౌసింగ్ అమలుపై అర్జీలు సమర్పించారు. కార్యక్రమంలో మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## మొక్కలు నాటిన పురప్రముఖులు



పుత్తూరు రూరల్, నవంబరు 28 ప్రభాతవార్త: పుత్తూరు పట్టణంలోని ఆరేటమ్మ గుడి ఆవరణలో ఎండోమెంట్ ఈవో జయకృష్ణ ఆధ్వర్యంలో పుత్తూరు పుర ప్రముఖులు దాదాపు 70 మొక్కలు నాటారు. వారు మాట్లాడుతూ సమాజంలో పచ్చదనం-పరి శుభ్రత అత్యంత ముఖ్యమని, ఇదే విధంగా ముఖ్య మని, ఇదే విధంగా అందరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు.పుత్తూరు పట్టణ టీడీపీ అధ్యక్షుడు గాలి జీవరత్నంనాయుడు, సదాశివేశ్వర ఆలయ చైర్మన్ దిలీప్‌కుమార్, పుత్తూరు పుర ప్రముఖులు బి.ఆర్.మురళీకృష్ణ, విక్కిరాయల్, జి.బాబు, బి.రమేష్, ఆలయ కమిటీ సభ్యులు పార్థీబన్, అమృతవల్లి, చిలకమ్మ, మునికుమార్ పాల్గొన్నారు.

## నియామ నిబంధనల ప్రకారం రికార్డులు నమోదు

కేవీబీపురం, నవంబరు 28 ప్రభాతవార్త:



మండల కేంద్రమైన కేవీబీ పురం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఉన్న మహిళా సమైక్య కార్యాలయంలో శుక్రవారం మధ్యాహ్నం మన డబ్బులు మన లెక్కలు కార్యక్రమాన్ని ఏపీఎం ఇందిరా అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీడీవో మాలతి హాజరయ్యారు. ఏపీఎం మాట్లాడుతూ ప్రతి సంఘం నియామ నిబంధనల ప్రకారం రికార్డులు, లెక్కలు రాసుకుంటేనే బ్యాంకుల వద్ద బ్యాంకు లావాదేవీలు సంఘాల ఆర్థిక పురోభివృద్ధికి దోహదపడతాయని తెలిపారు. ఎంపీడీవో మాలతి మాట్లాడుతూ సంఘమిత్రలు బాగా ఆసంఘం లెక్కలు సక్రమంగా రికార్డులు నమోదు చేయాలని, పురోగతికి తోడు పడాలని జిల్లా స్థాయిలో మండల సమైక్య మంచి పేరు సాధించుకుని పైలెట్ ప్రాజెక్టుఎదగాలని ఎంపీడీవో కోరారు. సీసీలు ప్రభాకర్, గోవిందస్వామి, పంచాయతీ కార్యదర్శులు, సంఘ మిత్రలు తదితర మహిళలు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే సాక్షిగా ప్రజాసంఘాల ఆగ్రహం

**- గూడూరును నెల్లూరులో కలపాలని డిమాండ్**



కోట, నవంబర్ 28 ప్రభాతవార్త: గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్‌కు శుక్రవారం కోటలో యుటిఎఫ్ అధ్యక్షులు ముప్పల మనోహర్, యుటిఎఫ్ నాయకులు జనార్దనం, భాస్కర్, భోగేశ్వరరావు, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం గూడూరును నెల్లూరు జిల్లాలో కలపాలంటూ వినతిపత్రం అందజేశారు. యుటిఎఫ్ నాయకులు మనోహర్, జనార్ధనం మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని కోరారు. నాడు ఎన్నికలకు ముందు చంద్రబాబునాయుడు, లోకేష్ ఇచ్చిన హామీలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న విషయాన్ని వారు గుర్తుచేశారు. గూడూరు నుంచి 150 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

# ప్రజా సమస్యలు పరిష్కరించండి

కోట, నవంబర్ 28 ప్రభాతవార్త: ప్రజల సమస్యలను అధికారులు నిర్లక్ష్యం వహించకుండా త్వరితగతిన పరిష్కరించాలని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ కోరారు. శుక్రవారం కోట ఎంఆర్‌సి భవనంలో ప్రజా దర్బార్ నిర్వహించి ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా పాశిం సునీల్‌కుమార్ మాట్లాడుతూ ప్రతిసారి గూడూరులో నిర్వహించే ప్రజా దర్బార్ ఈ సారి ప్రజలకు మరింత సౌకర్యవంతంగా ఉండేందుకు మండల కేంద్రాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో తహశీల్దార్ కె.జయజయరావు, ఎంపిడిఓ దిలీప్‌కుమార్, డిప్యూటీ ఎంపీడీఓ వేణు, ఎంపిపి అంజమ్మ, ముత్యాలమ్మ దేవస్థానం ఛైర్మన్ చిల్లకూరు దశరథరామిరెడ్డి, ఎఎంసి ఛైర్‌పర్సన్ దారా ప్రమీల, జలీల్ అహ్మద్, నెల్లూరు మోహన్‌రెడ్డి, మండల టిడిపి అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, మధుయాదవ్, పలగాటి జితేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక సమానత్వ సాధనకు పూలే కృషి

**- సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ**



నాయుడుపేట రూరల్, నవంబర్ 28 ప్రభాతవార్త: కుల వివక్షణ రూపుమాపి సామాజిక సమానత్వం సాధనకు మహాత్మా జ్యోతిరావు పూలే దంపతులు ఎనలేని కృషి చేశారని సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. శుక్రవారం మహాత్మా జ్యోతిరావు పూలే 135వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయుడుపేట పట్టణంలో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. జ్యోతిరావు పూలే దంపతుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి అబ్జర్వర్ జడ్.శివప్రసాద్, మున్సిపల్ వైస్ ఛైర్మన్ షేక్ రఫీ, ఎఎంసి ఛైర్మన్ ఉయ్యాల ప్రవీణ్, శ్రీపోలేరమ్మ ఆలయ కమిటీ ఛైర్మన్ నానబాల సుబ్బారావు, బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు జువ్వలపాటి మస్తాన్, టిడిపి నాయకులు కట్టా వెంకటరమణారెడ్డి, పసల గంగాప్రసాద్, పోట్లపూడి రాజేష్, అశోక్‌రెడ్డి, గోనుబాబు, కందల కృష్ణారెడ్డి, పేరంశెట్టి శ్రీరాంప్రసాద్, పలుకూరు ముత్యాలయ్య, కాపులూరు చక్రపాణి, బల్లి ముత్యాలయ్య, ఎస్.కృష్ణయ్య, నిత్య కృష్ణారెడ్డి, వినుకొండ ధనంజయ, అవదానం సుధీర్, చెందేటి సుజాత, సంపూర్ణమ్మ, హైమా, మొండెం బాబు, ఆబోతుల బాబు తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత : ఎమ్మెల్యే నెలవల



నాయుడుపేట రూరల్, నవంబర్ 28 ప్రభాత వార్త: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. నాయుడుపేట తహశీల్దార్ కార్యాలయంలో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. మొత్తం 92 అర్జీలు అందజేశారు. సంబంధిత సమస్యలను సత్వరమే పరిష్కరించే విధంగా అధికారులకు ఆదేశాలిచ్చారు. సమస్యలు పరిష్కరించేందుకు ప్రత్యేకంగా ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని ప్రతి శుక్రవారం నిర్వహిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

# ఆర్యవైశ్యులకు అండగా కూటమి ప్రభుత్వం : ఎమ్మెల్యే



నాయుడుపేట రూరల్, నవంబర్ 28 ప్రభాతవార్త: రాష్ట్రంలో ఆర్యవైశ్యుల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం చేయూతనిస్తుందని సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. పట్టణంలో శుక్రవారం తిరుపతి జిల్లా రూరల్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు గూడూరు కిషోర్‌కుమార్ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతాభివందనలు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ముందుగా అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఆర్యవైశ్యులకు ప్రాధాన్యత ఇస్తూ వారి కులదైవమైన శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి పేరును పెనుగొండ జిల్లాకు అనుసంధానం చేసి శ్రీవాసవి పెనుగొండ జిల్లాగా మార్చినట్లు తెలియ జేశారు. 2024 ఎన్నికల్లో నాయుడుపేట ఆర్యవైశ్యులు తన గెలుపునకు కృషి చేశారని కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం తిరుపతి జిల్లా రూరల్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు గూడూరు కిషోర్‌కుమార్ మాట్లాడుతూ శ్రీవాసవి పెనుగొండ జిల్లాగా పేరుమారుస్తూ జీఓ విడుదల చేసిన కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఆర్యవైశ్యుల అభ్యున్నతికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, నాయుడుపేట మున్సిపల్ వైఎస్ ఛైర్మన్ షేక్ రఫీ, నాయుడుపేట ఎఎంసి ఛైర్మన్ ఉయ్యాల ప్రవీణ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ టిడిపి అబ్జర్వర్ జడ్.శివప్రసాద్, మున్సిపల్ వైస్ ఛైర్మన్ షేక్ రఫీ, ఎఎంసి ఛైర్మన్ ఉయ్యాల ప్రవీణ్, శ్రీపోలేరమ్మ ఆలయ ఛైర్మన్ నానబాల సుబ్బారావు, బిసి సంక్షేమసంఘం అధ్యక్షులు జువ్వలపాటి మస్తాన్, తెలుగుదేశం నాయకులు కట్టా వెంకటరమణారెడ్డి, పసల గంగాప్రసాద్, పోట్లపూడి రాజేష్, అశోక్‌రెడ్డి, గోను బాబు, కందలకృష్ణారెడ్డి, పేరంశెట్టి శ్రీరాంప్రసాద్, పలుకూరు ముత్యాలయ్య, కాపులూరు చక్రపాణి, బల్లి ముత్యాలయ్య, ఎస్.కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

# పౌర హక్కుల భంగం కలిగించదు

వాకాడు, నవంబర్ 28 ప్రభాతవార్త: పౌర హక్కుల భంగం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మండల తహసిల్దార్ సయ్యద్ ఇక్బాల్ తెలిపారు. శుక్రవారం వాకాడు గ్రామంలోని గిరిజన కాలనీలో( బంగ్లా సెంటర్) మండల తహసిల్దార్ సయ్యద్ ఇక్బాల్ ఆధ్వర్యంలో మండల స్థాయి అధికారులతో, ప్రజా ప్రతినిధులతో పౌర హక్కుల దినోత్సవ కార్యక్రమం జరిగింది. . ఈ కార్యక్రమంలో ఆర్డబ్ల్యూఎస్ ఏఈ సుమాంజలి, ఎంఈఓ నసీం అలీ, రెవెన్యూ ఇన్స్పెక్టర్ అఖిల్, వివిధ శాఖ అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

## బేటి బచావో భేటీ పడావో



పెళ్లకూరు, నవంబర్ 28 ప్రభాతవార్త :మండలంలోని స్థానికంగా ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల నందు నాయుడుపేట ఐసిడిఎస్ ప్రాజెక్ట్ వారు పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు బాలల హక్కులు బాల్య వివాహాలు, మరియు ఫోక్సో చట్టం మొదలైన విషయాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాసాలపై పోటీలు నిర్వహించి గెలిచిన విద్యార్థులకు బహుమలు ప్రధానం చేశారు.ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సూపర్వైజర్ సాయి శ్రీలక్ష్మి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు స్వర్ణలత, ఇతర ఉపాధ్యాయులు అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

## చెంబేడు రోడ్డు దుస్థితిపై ఎమ్మెల్యేకు వినతి

పెళ్లకూరు, నవంబర్ 28 ప్రభాతవార్త: మండలంలో 71వ నెంబర్ జాతీయ రహదారి నుండి చెంబెడు వరకు సుమారు ఐదు కిలోమీటర్లు ఉన్న రహదారి గుంతలుమయంగా మారి దారుణంగా ఉంది. ఈ రహదారి గుండా సుమారు 10 గ్రామాలకు ప్రజలు రాకపోకలు కొనసాగిస్తుంటారు. అలాగే ఇదే రహదారి గుండా గ్రీన్ ప్యానల్ మరియు క్రషర్ల యొక్క పెద్ద పెద్ద వాహనాలు రాకపోకలు కొనసాగడంతో రహదారిపై గొంతులు ఏర్పడి దారుణంగా తయారయింది. దీని విషయమై 10 గ్రామాల ప్రజలు తెలుగుదేశం మరియు జనసేన నాయకులతో కలిసి శుక్రవారం నాడు ఎమ్మెల్యే విజయశ్రీకి వినతి పత్రం సమర్పించి మా రోడ్డును బాగు చేయాలని విన్నవించుకున్నారు.ఈ కార్యక్రమంలో పెళ్లకూరు మండల జనసేన అధ్యక్షులు మల్లాం విజయ్, జనసేన నాయకులు తాళ్ల రెడ్డి శ్రీనివాస్,నాయకులు పాల్గొన్నారు.

## వెంకటగిరి నియోజకవర్గం మొత్తం... గూడూరు డివిజన్‌లో విలీనం

వెంకటగిరి, నవంబర్ 28 ప్రభాతవార్త: నియోజకవర్గంలోని ఆరు మండలాలను గూడూరు డివిజన్లో కలుపుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కలువాయి, రాపూరు, సైదాపురం మండలాలను గూడూరు డివిజన్లో కొత్తగా కలిపారు. వెంకటగిరి, బాలాయపల్లి,డక్కిలి, మండలాలు మొదటి నుంచి గూడూరు డివిజన్‌లోనే ఉన్నాయి. కలువాయి ఆత్మకూరు డివిజన్, రాపూరు నెల్లూరు, సైదాపురం గూడూర్ డివిజన్లో గతంలో ఉండేవి. అయితే ఇప్పుడు ఈ మూడు మండలాలను గూడూర్ డివిజన్ పరిధిలోకి తీసుకొచ్చారు. ఆనం రామనారాయణరెడ్డి ఎమ్మెల్యేగా ఉండగా కలవాయి రాపూర్ సైదాపురం మండలాలను నెల్లూరు జిల్లాలోకి అప్పుడు సీఎం జగన్మోహన్‌రెడ్డికి చెప్పి విలీనం చేయించారు. ఇప్పుడు వెంకటగిరి నియోజకవర్గంలోని ఆరు మండలాలు తిరుపతి జిల్లా పరిధిలోకి వచ్చాయి. రాపూరు, కలవాయి, సైదాపురం మండలాలను గూడూరు డివిజన్లో కలిపి తిరుపతి జిల్లాలోని ఉంచాలని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, పారిశ్రామికవేత్త గంగప్రసాదులు, సీఎం నారా చంద్రబాబు నాయుడుకు వినతి పత్రం అందజేయడంతో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. ఎమ్మెల్యే రామకృష్ణ నియోజకవర్గంలోని అన్ని జిల్లాలను తిరుపతి జిల్లా లోనే ఉంచాలని నేరుగా సీఎంను కలిసి అనుకున్న విధంగా చేసుకున్నారు. మొత్తం మీద ఆరు మండలాలు తిరుపతి జిల్లాలోకి రావడంతో అందరూ ఆశిస్తున్నారు.

## ఆల్తూరుపాడు తక్షణమే పూర్తి చేయాలి : సిపిఐ



వెంకటగిరి, నవంబర్ 28 ప్రభాతవార్త: నియోజకవర్గం డక్కలి మండలంలో ఉన్న ఆల్టూరు పాడు మినీ రిజర్వాయర్‌ను తక్షణమే పూర్తి చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పి. మురళి డిమాండ్ చేశారు. వెంకటగిరి పట్టణంలో సిపిఐ పార్టీ సభ్యుల రాజకీయ సైద్ధాంతిక శిక్షణా తరగతులు పి.బాలకృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ శిక్షణా తరగతులును ప్రారంభించి మాట్లాడుతూ మినీ రిజర్వాయర్‌ను పూర్తి చేయడం వలన డక్కిలి, వెంకటగిరి మండలంలోనే కాకుండా ఏర్పేడు మండలంతో పాటు తిరుపతి ప్రజలకు కూడా తాగు అందించే అవకాశం ఉందని అధికారులు గుర్తించి తక్షణమే పూర్తి చేయాలని కోరారు. ఈ శిక్షణా తరగతులులో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య, కే రాధాకృష్ణ, నియోజక వర్గ కార్యదర్శి పి బాలకృష్ణ, నియోజక వర్గ నాయకులు జాన్, నరసింహులు, డక్కిలి శివ కుమార్, ముని కృష్ణారెడ్డి, మునీంద్రా, సాయి అంకయ్యలు పాల్గొన్నారు.

## ఘనంగా జ్యోతిరావు పూలే 135వ వర్ధంతి వేడుకలు



గూడూరు, నవంబర్ 28 ప్రభాతవార్త: ఉమ్మడి నెల్లూరు జిల్లా గూడూరు పట్టణంలోని కార్ స్టాండ్ వద్ద ఉన్న మహాత్మ జ్యోతిరావు పూలే, సావిత్రి బాయ్ పూలే విగ్రహాల వద్ద జ్యోతిరావు పూలే 135వ వర్ధంతి సందర్భంగా మహనీయుని స్మరించుహించుకుంటూ ఘన నివాళులు అర్పించారు. సంఘ సంస్కరణ కుల వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాటంచేసి మహిలళల విద్యకువిశేష కృషి చేసిన పూలేకి బహుజన సమాజ బీఎస్పీ పార్టీ, ఏపి ప్రజాసంఘాల ఐక్యవేదిక ఇతర రాజకీయ నాయకులు కాంగ్రెస్ సిపిఎం సిపిఐ పార్టీ ఎమ్మార్పీఎస్ నాయకుల ఆధ్వర్యంలో వర్ధంతి నిర్వహించారు. గూడూరు ఇన్చార్జి మీజూరు సుబ్రమణ్యం అధ్యక్షతన జ్యోతిరావు పూలే వర్ధంతి ప్రజా సంఘాల నాయకులు జోగి శివకుమార్, నాసిన భాస్కర్ గౌడ్, ఎల్వి సుబ్బయ్య, బివి రమణయ్య, చిల్లకూరు వేమయ్య, చింతల రామయ్య, నక్కి ఇనాబోయిన చెంగయ్య, ఎల్లంపల్లి శ్రీనివాసులు, ఎన్ రమేష్ బాబు, గుంటమడుగు వెంకటేశ్వరరాజు, సుందరం, భాస్కర్, మల్లాపు వేణుగోపాల్‌లు పాల్గొన్నారు.

## గూడూరును జిల్లా కేంద్రంగా ప్రకటించాలి : ప్రజా సమితి

గూడూరు, నవంబర్ 28 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం గూడూరును జిల్లా కేంద్రంగా ప్రకటించేవరకు గూడూరు ప్రజాసమితి ఆధ్వర్యంలో ఉధృతంగా ఉద్యమ కార్యక్రమాలను చేపడుతామని ప్రజా సమితి నాయకులు కోడూరు మీరారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక డివిజన్ పోస్టాఫీసు వద్ద పోస్టుకార్డుల ఉద్యమ కార్యక్రమాన్ని నిర్వహించి పోస్టుకార్డులను సీఎం అడ్రసుకు పంపేలా పోస్టుబాక్సులో వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గూడూరును జిల్లా కేంద్రంగా చేసేందుకు అనువైన అన్ని వసతులు ఉన్నాయ అన్నారు. గూడూరును కూడా జిల్లా కేంద్రంగా చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ ఉద్యమంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మనుబోలు సతీష్ రెడ్డి, ఆనిమెళ్ల శివకుమార్, మహేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

# మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలకు లగ్నం పత్రిక



సత్యవేడు, నవంబరు 28 ప్రభాత వార్త: నాగలాపురం మండలంలో వెలసిన సురుటుపల్లి గ్రామంలో కొలువై ఉన్న శ్రీ పల్లికొండేశ్వం స్వామి ఆలయంలో ఫిబ్రవరి నెల 7వ తేదీ నుంచి 17 తేదీ వరకు 11 రోజుల పాటు నిర్వహించబోయే మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలకు సంబంధించి కొండేశ్వర స్వామి ఆలయంలో ఆలయ ట్రస్టు బోర్డు సభ్యుల ఆధ్వర్యంలో ఆహ్వాన పత్రికను రాయడం జరిగింది. ఈ సందర్భంగా ఆలయం మండపంలో నందీశ్వరుని ఎదురుగా ఆలయ ఛైర్మన్ పద్మనాభరాజు, ఈవో లత, ట్రస్టు బోర్డు సభ్యులతో కలసి ఆలయ అర్చకులు సమక్షంలో శివరాత్రి బ్రహ్మోత్సవాలకు సంబంధించి ఆహ్వాన పత్రికను ముదిరించేందుకు లగ్న పత్రిక రాయడం జరిగింది. రాసిన లగ్న పత్రికను ఆలయ అర్చకులు నంది దగ్గర పూజలుచేసి అనంతరం ఆలయ ఛైర్మన్‌కు, ట్రస్టు బోర్డు సభ్యులకు అందించడం జరిగింది. ఈ సందర్భంగా ఆలయ ఛైర్మన్ పద్మనాభరాజు మాట్లాడుతూ ఎన్నడూ లేని విధంగా వచ్చే సంవత్సరం ఫిబ్రవరిలో జరిగే మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలను అందరి సహకారంతో విజయవంతంచేయడానికి కృషి చేస్తానన్నారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు కార్తికేశన్ మాట్లాడుతూ జనవరి నెలలో పండుగలు పూర్తయిన తరువాత లగ్న పత్రికను ముద్రించి దాతలను ముందుగా కలవడానికి ప్రయత్నించాలని ట్రస్టు బోర్డు సభ్యులను ఆయన కోరారు.కార్యక్రమంలో ఈవో లత, ఆలయ ట్రస్టు బోర్డు సభ్యులు శ్రీనివాసులు నాయుడు, కృష్ణయ్య, నెల్సన్ మండేలా, హంస, జయంతి, కవిత, హేమంత్‌కుమార్, నాగభూషణం పాల్గొన్నారు.

# ప్రీమియర్ లీగ్ పోటీలు అట్టహాసంగా ప్రారంభం




తిరుపతి విద్య, నవంబర్ 28 ప్రభాతవార్త: నారాయణ పాఠశాల యందు నారాయణ ప్రీమియర్ లీగ్ 2025 పేరుతో క్రీడలు పోటీలు ప్రారంభించడం జరిగింది.ఈ కార్యక్రమానికి సినీ హీరో శ్రీకాంత్, నారాయణ విద్యా సంస్థల డైరెక్టర్ గంటా రవితేజ,నారాయణ పాఠశాల కార్యనిర్వహణ అధికారి కొండలరావు, ఏజీఎం శ్రీనివాసులు విచ్చేసి క్రీడా జ్యోతిని వెలిగించే క్రీడలను ప్రారంభించారు. విద్యార్థులు నిర్వహించిన మార్చ్ ఫాస్ట్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. నటుడు శ్రీకాంత్ మాట్లాడుతూ చదువులోనే కాదు అన్ని రంగాలలో ముందుంటాయని తెలిపారు. విద్యార్థుల శారీరక ఎదుగుదలకు క్రీడలు ఎంతో అవసరమని తెలిపారు. ఎస్ పి రవి మనోహరాచారి మాట్లాడుతూ క్రీడలు పాఠశాలల యందు నిర్వహించడం వలన విద్యార్థులలో నైతిక బలం దేశభక్తి ఐకమత్యం అంటే గుణాలు కలుగుతాయని తెలిపారు. తుడా ఛైర్మన్ డాలర్ దివాకర్‌రెడ్డి మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల యొక్క శారీరిక దృఢత్వానికి తోడ్పాటు ఇస్తాయని తెలిపారు. డీజీఎం కొండలరావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చదువుతోపాటుగా క్రీడలు పట్ల,ఆటల పట్ల ఆసక్తిని పెంచుకోవాలని అన్నారు.ఈ ప్రీమియర్ లీగ్ లో తిరుపతి, చిత్తూరు,అన్నమయ్య, మదనపల్లి,వేలూరు జిల్లాలోని విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.నాలుగో తరగతి నుండి పదవ తరగతి వరకు పదివేల మంది నారాయణ పాఠశాలలో విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం లు అల్లం శ్రీనివాసులు, రవీంద్ర ఫణి కుమార్,ఆర్ ఐలు, అన్ని బ్రాంచీల ప్రిన్సిపల్స్,రవికాంత్ గుప్తా,లీలాధర్ శ్రీనివాస్, ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మొక్కలు నాటిన టిడిపి నాయకులు



పుత్తూరు, నవంబరు 28 ప్రభాతవార్త : పట్టణంలోని ఆరేటమ్మ ఆలయ ఆవరణలో తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షుడు గాలి జీవరత్నం నాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం మొక్కలు నాటే కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నానాటికీ పర్యావరణం క్షీణిస్తున్న నేపథ్యంలో పచ్చదనం - పరిశుభ్రత అత్యంత ఆవశ్యకమన్నారు. తమ నాయకుడు చంద్రబాబునాయుడు కూడా క్లీన్ అండ్ గ్రీన్ అనే పథకాన్ని అమలు చేసి దేశంలో ఇతర రాష్ట్రాలకు మార్గదర్శకుడయ్యారని తెలిపారు. అనంతరం ఆలయ ఆవరణలో 70 మొక్కలు నాటారు. కార్యక్రమంలో సదాశివేశ్వర ఆలయ ఛైర్మన్ దిలీప్‌కుమార్, కార్యనిర్వహణాధికారి జయకృష్ణ, నాయకులు నైనేరి విక్కీరాయల్, బి.ఆర్.మురళీకృష్ణ, జి.బాబు, బి.రమేష్, పార్దిబన్, అమృతవల్లి, చిలకమ్మ, మునికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# జిఎస్టీ ప్రయోజనాలు వినియోగారులకు చేరాలి

**-రాష్ట్ర పన్నుల సంయుక్త కమిషనర్ రవీంద్రనాథ్**



తిరుపతిరూరల్, నవంబర్ 28 ప్రభాతవార్త: డ్రగ్స్-మిడిసిన్‌లపై తగ్గిన జిఎస్టీ ప్రయోజనాలు వినియోగదారులకు చేరాలని రాష్ట్ర పన్నుల సంయుక్త కమిషనర్ రవీంద్రనాథ్ అన్నారు. శుక్రవారం తిరుపతి కమర్షియల్ టాక్స్ కాంప్లేక్స్ లో డ్రగ్స్-మెడికల్స్ హోల్‌సెలర్లు, రిటైలర్లు, డిస్ట్రిబ్యూటర్ల విస్తృత సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ ఇటీవల జిఎస్టీ రేటు తగ్గింపులను ప్రజలకు పారదర్శకంగా పాస్ అన్ చేయడం అన్ని డీలర్ల బాధ్యత అని స్పష్టం చేసారు. ప్రతి ఇన్వాయిస్‌లో తగ్గిన జిఎస్టీ రేటుతో వచ్చిన ప్రయోజనాన్ని స్పష్టంగా చూపించాలన్నారు. వినియోగదారుల ప్రయోజనాలను హరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కంపోజిషన్ పన్ను చెల్లింపుదారులు రెగ్యులర్ కేటగిరికి మారాల్సిన అవసరం, ప్రొఫెషన్ ట్యాక్స్ చెల్లింపు, అవసరమైన రిజిస్ట్రేషన్ల పూర్తి, శాసనబద్ధ రిటర్నులను సమాయానికి దాఖలు చేయడం వంటి అంశాలపై డీలర్లకు మార్గదర్శకాలు తెలియజేసారు. జిఎస్టీ 2.0 అమలు నేపధ్యంలో పన్ను చెల్లింపుదారులు పాలనాపరమైన నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని కోరారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరత్నం, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యధర్శి సుబ్బరామ గుప్తా, ప్రతినిధులు నరసింహరెడ్డి, కుమార్, శశి, శివ, డ్రగ్స్-మెడికల్స్ డీలర్లు, తిరుపతి అసిస్టెంట్ కమిషనర్ ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**టిటిడి బోర్డు సభ్యుడు**

# భానుప్రకాశ్‌కు భారత్ గౌరవ్ అవార్డు




తిరుపతి,నవంబర్28ప్రభాతవార్త: సామాజిక సేవ,ఆధ్యాత్మికచింతన కలిగిన టిటిడి బోర్డు సభ్యుడు జి.భానుప్రకాశ్‌రెడ్డి భారత్ గౌరవ్ అవార్డు అందుకున్నారు. హైదరాబాద్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమ ంలో తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్‌శర్మ, చిన్నజీయర్‌స్వామి నుండి భానుప్రకాశ్‌రెడ్డి ఈ అవార్డును స్వీకరించారు. ఈ అవార్డు తనకు అత్యంత గొప్పగౌరవం కలిగించిందని, భారత్ గౌరవ్ నిర్వాహకులకు ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులోనూ ధార్మిక కార్యక్రమాలు, సేవా కార్యక్రమాలను కొనసాగిస్తానని భాను తెలిపారు. ఈ సందర్భంగా పలువురు శ్రేయోభిలాషులు,మిత్రులు అభినందనలు తెలిపారు.

**ఎంఎల్ఏ,ఎంపిల కృషితో...**

# గుడిమల్లం అన్నదాన సత్రానికి అనుమతులు



శ్రీకాళహస్తి,నవంబర్ 28 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని ఏర్పేడు మండలం గుడిమల్లంలో వెలసిన అనందవల్లి సమేత పరశురామేశ్వరుని ఆలయానికి వచ్చే భక్తుల కోసం నిత్యాన్నదాన సత్ర నిర్మాణానికి నేషనల్ మాన్యుమెంట్స్ ఆథారిటి అనుమతి మంజూరు చేసింది.ఈ మేరకు వైకాపా నాయకులు తిరుపతి ఎంపి మద్దెల గురుమూర్తి కృషితో నిధులు మంజూరు అయ్యాయని తెలుపగా, శ్రీకాళహస్తి శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి కృషితో నిధులు, సత్రనిర్మాణానికి నిధులు అనుమతులు వచ్చాయని కూటమి నాయకులు ప్రకటించారు. ఏదీ ఏమైనా ఎవరు ప్రయత్నించినా ఇక్కడకు వచ్చే భక్తుల సౌకర్యార్థం నిత్యాన్న సత్రం మంజూరు అయ్యింది. ఈ నిర్మాణాల్లో కొంత భాగం ఆలయ రక్షిత ప్రాంతంలోకి రావటంతో అనుమతులు అలస్యమైతున్న విషయాన్ని పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి ఎంపి తెచ్చారు. ఈ పరిస్థితిలో భక్తులకు అత్యవసరమై తాత్కాలిక అన్నదాన సత్రం నిర్మాణానికి నేషనల్ మ్యానుమెంట్స్ ఆథారిటి 'నో అబ్జెక్షన్' సర్టిఫికేట్ జారి చేసింది. సర్వే నెంబర్ 17లో 5 మీటర్ల ఎత్తు 1913.47 మీటర్ల విస్తీర్ణంలో తాత్కాలిక నిర్మాణానికి కొన్ని నిబంధనలతో అనుమతి మంజూరు చేసినట్లు ఎంపి గురుమూర్తి తెలిపారు. కాగా ఇది కూటమి ప్రయత్నం ఫలించిందని ఆలయ మాజీ ఛైర్మెన్ బత్తల గిరి నాయుడు,ఆలయ ఇఓ రామచంద్రారెడ్డి తెలిపారు. స్థానిక శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి గెలిచిన తరువాత ఆలయ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారన్నారు.

# పూలే ఎనలేని కృషి

**-పలువురు నివాళులు**



తిరుపతి,నవంబర్ 28ప్రభాతవార్త: సమాజంలో మహిళల అభ్యున్నతికి, హక్కుల కోసం మహాత్మాజ్యోతిరావుపూలే ఎనలేని కృషిచేశారని పలువురు ప్రముఖులు కొనియాడారు. సామాజిక న్యాయం, సమానత్వం కోసం పూలే నిరంతరం పోరాటం సాగించారన్నారు. ఆయన సేవలు, ఆలోచనలు మార్గదర్శకం నేటికీ సమాజానికి దారిచూపిస్తున్నాయన్నారు.జ్యోతిరావుపూలే వర్ధంతి సందర్భంగా శుక్రవారం ఆయన విగ్రహానికి టిడిపి బిసి నేతలు జి.నరసింహయాదవ్, వెంకట పుష్పావతి యాదవ్, మల్లెల నాగరాజు, అల్‌మెన్‌రాజు, సదాశివం, జ్ఞానశేఖర్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు..

**-బిజెపి నాయకులు:**

పూలే వర్ధంతిన ఆయన విగ్రహానికి బిజెపి నేతలు పుష్పాంజలి ఘటించారు.బాలాజీకాలనీలోని ఆయన విగ్రహానికి బిజెపి నేతలు గుండాల గోపీనాథరెడ్డి, కట్టమంచిచంద్రబాబు, సుబ్రమణ్యంయాదవ్, అక్కినపల్లి మునికృష్ణయ్యయాదవ్, వరప్రసాద్, భాస్కర్, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, దీపక్,మురళి తదితరులు పాల్గొన్నారు.

# రైతు బజార్ల ఏర్పాటుకు... మంత్రి ఆదేశాలు

**టిడిపి నేత పోతుగుంట విజయ్‌బాబు**



పుత్తూరు, నవంబరు 28 ప్రభాతవార్త : నగరి నియోజకవర్గంలోని నగరి, పుత్తూరు మునిసిపాలిటీల్లో రైతు బజార్ల ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశాలు జారీ చేశారని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పోతుగుంట విజయ్‌బాబు తెలిపారు. నగరి, పుత్తూరు పట్టణాల్లో అటు రైతులకు, ఇటు ప్రజలకు సౌకర్య ంగా వుండేలా రైతు బజార్లు ఏర్పాటు చేయాలని కోరుతూ శుక్రవారం ఆయన విజయవాడలో మంత్రికి వినతిపత్రం ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దళారుల ప్రమేయంతో పుత్తూరు, నగరి పట్టణాల్లో కూరగాయల రైతులకు గిట్టుబాటు ధర లభించడం లేదన్నారు. అలాగే ప్రజలు కూడా అందుబాటు ధరలకు కూరగాయలు కొనుగోలు చేయలేకపోతున్నారని తెలిపారు. ఈ పరిస్థితుల్లో ఇరు వర్గాలకు న్యాయం జరగాలంటే రైతు బజార్ల ఏర్పాటు వల్లే సాధ్యమవుతుందని భావించి ఆ మేరకు మంత్రికి రైతు బజార్ల ఏర్పాటు కోసం విజ్ఞప్తి చేశానని వివరించారు. తన అభ్యర్ధన మేరకు మంత్రి స్పందించి పుత్తూరు, నగరి పట్టణాల్లో రైతు బజార్ల ఏర్పాటుకు వెంటనే తగిన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారని తెలిపారు.

# వినూత్న రీతిలో రోబోతో రెండు మోకాళ్ళ మార్పిడి



తిరుపతి హెల్త్, నవంబర్ 28 ప్రభాతవార్త: వినూత్న రీతిలో రోబోతో రెండు మోకాళ్ళ మార్పిడి శస్త్ర చికిత్సకు శ్రీకారం చుట్టినట్లు మణిపాల్ ఆస్పత్రి ఆర్థోపెటిక్, రోబోటిక్ జాయింట్ రీప్లేస్మెంట్ సర్జరీ డాక్టర్ దినేష్ మనీ తెలిపారు. స్థానిక తిరుపతి ప్రెస్క్లబ్లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ దినేష్ మని మాట్లాడుతూ బెంగళూరు తరహాలో తిరుపతిలో మణిపాల్ ఆస్పత్రిలో రోబోలతో రెండు మోకాళ్ళ మార్పిడి శస్త్ర చికిత్సలను సులభతరముగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వయసుతో నిమిత్తం లేకుండా ఎటువంటి నొప్పి లేకుండా ఆపరేషన్లు చేయనున్నట్లు తెలియజేశారు. రెండు మోకాళ్ళ ఆపరేషన్ ని కూడా ఒకే పర్యాయం చేసే అవకాశం ఉందని చెప్పారు. అంతేకాకుండా ఏ వయసు వారికైనా రోబోల సహాయంతో ఆపరేషన్లు చేయడం వల్ల త్వరగా రోగి కోలుకుంటారన్నారు. ఇప్పటికే రోబోలతో చేసే ఆపరేషన్లు మంచి ఫలితాలను ఇచ్చినట్లు స్పష్టం చేశారు. రోగులు ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ తో పాటు రెండు మోకాళ్ళ మార్పిడి శస్త్ర చికిత్స చేసుకున్న రోగులు వారి బంధువులు పాల్గొన్నారు.